
సాక్షి
జోగులాంబ గద్వాల

శనివారం । 19 । జూలై । 2025



వసూళ్లు ఆగేనా..?
సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అక్రమ వసూళ్లు ఆగేనా అని చర్చించుకుంటున్నారు.

వివరాలు 8లో ▸



కృష్ణమ్మ పరుగులు..
జూరాలకు భారీ వరద వస్తుండటంతో దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
37.2 /23.8

వాతావరణం
ఉదయం నుంచే ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

23న విద్యాసంస్థల బంద్‌కు పిలుపు

గద్వాల: ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కాలేజీలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, ప్రైవేటు విద్యాసంస్థలలో ఫీజు దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 23వ తేదీన విద్యాసంస్థల బంద్ తలపెట్టినట్టు ఆ సంఘాల నాయకులు ప్రవీణ్, హాలీంపాష వివరించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో పీడీఎస్‌యూ ఆఫీసులో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలలో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకువస్తామని చెప్పిన ప్రభుత్వం తరువాత పూర్తిగా విస్మరించిందన్నారు. అదేవిధంగా విద్యాశాఖకు మంత్రి లేకుండా పోవడం శోచనీయమన్నారు. ఖాళీగా ఉన్న టీచర్, ఎంఈవో, డీఈవో పోస్టులను తక్షణమే భర్తీ చేయాలన్నారు. ఇంటర్‌కాలేజీలలో మధ్యాహ్న భోజనపథకాన్ని అమలు చేయాలని, పెండింగ్ స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని, బెస్ట్‌అవైలబుల్ స్కీమ్ బకాయిలు విడుదల చేయాలని, సంక్షేమ హాస్టళ్లతో పాటు, గురుకులాలకు సొంత భవన నిర్మాణం చేయాలన్నారు. బంద్ సందర్భంగా ఈనెల 23గద్వాలలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కాలేజీలు స్వచ్ఛందంగా బంద్‌లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాశీమ్, వీరేష్, తిరుమలేష్, నర్సింహ, వీరేష్, దానయ్య, హరీష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'నేతన్న భరోసా'కు దరఖాస్తుల ఆహ్వానం

గద్వాల: నేతన్నల భరోసా పథకంలో చేరేందుకు అర్హులైన నేతకార్మికుల నుంచి దరాఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చేనేత మరియు జౌళిశాఖ ఏడీ గోవిందయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఈపథకంలో చేరేందుకు జియోట్యాగ్ నంబర్ కలిగిన నేతకార్మికులు నిత్యం పనిలో ఉంటూ నిర్దేశించిన మేర చేనేత వస్త్రాలను ఉత్పత్తి చేయగలిగి పొదుపు పథకంలో నమోదైన వారు మరియు 18 సంవత్సరాల వయసు నిండిన వారు అర్హులని తెలిపారు. భరోసా పథకం కింద చేనేత కార్మికులకు వేతన ప్రోత్సాహకం సంవత్సరానికి గరిష్టంగా రూ.18వేలు, కార్మికుడికి రూ.6000 వేతన మద్దతు అందించనున్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రామాణిక వీవ్స్ లేబుల్ ప్రత్యేకమైన లోగోతో ప్రతి తెలంగాణ లేబుల్ చేయబడిన ఉత్పత్తికి నేత గుర్తింపుతో రూపొందించబడిందని కనీసం నాణ్యత ప్రమాణాలను నిర్ధారిస్తుందని తెలిపారు. జిల్లాలో చేనేత కార్మికులు ఫామ్–ఏ, ఫామ్–బి లను పూర్తి చేసి వీటితో పాటు వీవర్ మరియు కార్మికుని రెండు ఫోటోలు, ఆధార్, బ్యాంకు పాస్ బుక్కు జిరాక్స్ జతచేసి ఈనెల 25వ తేదీలోగా చేనేత జౌళిశాఖ గద్వాల ఆఫీసులో సమర్పించాలని, పూర్తి వివరాలకు 9573730056, 9666922281 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.



సభావేదికపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు వాకిటి శ్రీహరి, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లురవి, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్, ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, వంశీకృష్ణ, వీర్లపల్లి శంకర్, **మధుసూదన్‌రెడ్డి, మేఘారెడ్డి, రాజేష్‌రెడ్డి, పర్ణికారెడ్డి, అనిరుధ్‌రెడ్డి, నాయకులు ఒబేదుల్లా కొత్వాల్, శివసేనారెడ్డి, జగదీశ్వర్‌రావు, సంపత్‌కుమార్, సరిత, తిరుపతయ్య తదితరులు**

రెండేళ్లలో పూర్తి చేస్తాం

సాగునీటి ప్రాజెక్ట్‌ల బాధ్యత నాదే: సీఎం రేవంత్‌రెడ్డి

- డిసెంబర్ 9 నాటికి భూసేకరణ పూర్తి చేస్తాం.. పరిహారం చెల్లిస్తాం
- బీఆర్ఎస్ పాలనలోనే పాలమూరుకు తీవ్ర అన్యాయం
- గత ప్రభుత్వంలో జిల్లా మంత్రులు తెచ్చింది ఏమీలేదు
- శ్రీశైలం నిర్వాసితులను ఎందుకు ఆదుకోలేదు
- జటప్రోలులో యంగ్ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు శంకుస్థాపన

సాక్షి, నాగర్‌కర్నూల్/కొల్లాపూర్: పాలమూరులోని పెండింగ్ ప్రాజెక్టులన్నింటినీ పూర్తిచేసే బాధ్యత తాను తీసుకుంటున్నానని, రెండేళ్లలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండలం జటప్రోలులో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పురాతన మదనగోపాలస్వామి ఆలయాన్ని సందర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన బహిరంగసభలో ప్రసంగించారు. 'కొల్లాపూర్ ప్రాంతం.. ఒకవైపు కృష్ణానది, మరోవైపు నల్లమల అటవీ ప్రాంతం.. ఒకప్పుడు కౌన్ పూచ్‌తా కొల్లాపూర్ అనుకున్న ప్రాంతాన్ని, హమ్ జాదా లేనా కొల్లాపూర్ అంటూ అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం' అని అన్నారు. దేశంలో ఎక్కడ ప్రాజెక్టులు కట్టినా, తట్ట, పార పని చేసినా పాలమూరు బిడ్డలే ఉంటారని చెప్పారు. ఇక్కడి మట్టిలో పుట్టిన బిడ్డగా ఈ ప్రాంత అభివృద్ధి కోసం బాధ్యతను తీసుకుంటానని అన్నారు. డిసెంబర్ 9 నాటికి అన్ని ప్రాజెక్టుల భూ నిర్వాసితులకు పెండింగ్ పరిహారాన్ని చెల్లిస్తామని, భూసేకరణ పూర్తి చేస్తామని తెలిపారు. రెండేళ్ల కాలంలో పాలమూరు పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి తీరుతామని పేర్కొన్నారు. 'పాలమూరు బిడ్డగా ఇక్కడి పరిస్థితులు, కష్టాలు నాకు తెలుసు. గత ప్రభుత్వం పాలమూరు–రంగారెడ్డి, కేఎల్ఐ, జూరాల, నెట్టెంపాడు, బీమా, కోయిల్‌సాగర్, ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టులు కట్టకుండా నిర్లక్ష్యం చేసింది. రైతుల పొలాల్లోకి నీళ్లు రాలేదు. ఉమ్మడి రాష్ట్రంలో కన్నా బీఆర్ఎస్ పాలనలోనే పాలమూరుకు తీవ్ర అన్యాయం జరిగింది. ఈ జిల్లాకు చెందిన వ్యక్తి సీఎం కావడం వల్ల మొన్న జూరాలకు నిమిషాలలో రూ.120 కోట్లు మంజూరు చేశాం. ఇక్కడి నుంచి గత ప్రభుత్వంలో మంత్రులుగా పని చేసిన వాళ్లు దొంగలకు సద్దులు మోశారు. మొన్నటి ఎన్నికల్లో ఇంకో రెండు సీట్లు వచ్చుంటే.. ఈ జిల్లాకు మరో మంత్రి పదవి వస్తుండే.' అని పేర్కొన్నారు. పాలమూరు ప్రాజెక్టులో ఒక్క మోటార్‌ను ప్రారంభించి చేతులు దులుపుకున్న కేసీఆర్.. ఈ గడ్డకు చేసిందేమీ లేదన్నారు. జిల్లాకు చెందిన మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్‌లు తెచ్చింది ఏమీ లేదు. 98 జీఓ ద్వారా ఉద్యోగాలు ఇవ్వాలని శ్రీశైలం నిర్వాసితులు ఏళ్ల తరబడి అడుగుతూ వస్తున్నా.. వారిని గత ప్రభుత్వం ఎందుకు ఆదుకోలేదో చెప్పాలని సీఎం రేవంత్ ప్రశ్నించారు. కొల్లాపూర్ అభివృద్ధికి సంబంధించి పలు అంశాలను మంత్రి జూపల్లి కృష్ణారావు తన దృష్టికి తెచ్చారని పేర్కొన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ నేతృత్వంలో ప్రత్యేక సమీక్ష నిర్వహించి, కొల్లాపూర్ అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తామని వివరించారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణాలు ఏడాదిన్నర లోపు పూర్తి చేసి, దాని ప్రారంభానికి మళ్లీ ఇక్కడికి వస్తా సీఎం అన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డికి బుద్ధుడి జ్ఞాపిక అందిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

మహిళా సంఘాలకు చెక్కులు పంపిణీ

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 3,52,635 స్వయం సహాయక సంఘాలకు రూ.334 కోట్ల వడ్డీ లేని రుణాలను ఇస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. దీనికి సంబంధించిన చెక్కును మహిళా సంఘం సభ్యులకు అందజేశారు. కొల్లాపూర్ నియోజకవర్గంలోని 2,671 స్వయం సహాయక సంఘాలకు రూ.6.33 కోట్ల చెక్కులను అందజేశారు. అలాగే బ్యాంక్ లింకేజీ రుణాలు, ప్రమాద బీమా తదితర వాటిక సంబంధించి చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, రాజేష్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్, అనిరుధ్‌రెడ్డి, యెన్నం శ్రీనివాసరెడ్డి, పర్ణికారెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, మేఘారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, నాయకులు బెల్లయ్యనాయక్, సరిత, జగదీశ్వర్‌రావు, శివసేనారెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఒబేదుల్లా కొత్వాల్, తదితరులు పాల్గొన్నారు.

సాధికారత దిశగా పయనం: మంత్రి దామోదర రాజనర్సింహ

మహిళలు ఆర్థిక సాధికారత సాధించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు.

బీసీ రిజర్వేషన్లు చారిత్రాత్మకం: మల్లురవి

బీసీ రిజర్వేషన్ల అమలు చారిత్రాత్మక నిర్ణయమని, ఈ ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందని ఎంపీ మల్లు రవి అన్నారు. రేషన్ లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేపట్టామని, విద్యార్థులకు కాస్మొటిక్, మెస్ చార్జీలు పెంచామన్నారు.



కొల్లాపూర్ అభివృద్ధికి సహకరించాలి: మంత్రి జూపల్లి

కొల్లాపూర్ నియోజకవర్గానికి ఆదనంగా మరో **3 వేల ఇళ్లు కేటాయించాలని రాష్ట్ర ఎక్సైజ్,** పర్యా**టక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు** సీఎం రేవం**త్‌రెడ్డిని కోరారు. కొల్లాపూర్ అభివృద్ధి**కి రూ.500 **కోట్ల నిధులు మంజూరు చేయాల**ని, శ్రీశైలం నిర్వాసితులకు జీఓ 98 ప్రకారం ఉద్యోగాలు ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని, మాదాసి కురువలకు ఎస్సీ కుల ధ్రువపత్రాలు ఇప్పించాలని, నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి రూ.15 లక్షలు, కొల్లాపూర్ మున్సిపాలిటీకి రూ.50 కోట్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. మొలచింతలపల్లి శివారులో ఉన్న 1,600 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రపంచ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని, పెంట్లవెల్లి సింగిల్ విండో సొసైటీలోని 409 మంది రైతులకు రుణమాఫీ వర్తింపజేయాలని, సోమశిల– సిద్దేశ్వరం వంతెన నిర్మాణానికి త్వరగా అటవీశాఖ అనుమతులు ఇప్పించాలని సీఎం దృష్టికి తెచ్చారు.

సంక్షేమానికి ప్రాధాన్యం: మంత్రి వాకిటి

సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచనా విధానంలో విద్య, ఉపాధి, రైతు, మహిళా సంక్షేమానికి అధిక ప్రాధాన్యం లభిస్తోందని రాష్ట్ర పాడి పరిశ్రమ, మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేపట్టని విధంగా రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మించడం అభినందనీయమన్నారు.







బహిరంగ సభకు హాజరైన ప్రజలు, మహిళా సంఘాల సభ్యులకు ప్రమాద బీమా చెక్కు అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, దామోదర రాజనర్సింహ, ఎంపీ మల్లురవి, ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

ఉపాధ్యాయుల శిక్షణతో విద్యార్థులకు మేలు

వనపర్తిటౌన్: జిల్లాలోని 15 పీఎంశ్రీ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు సైన్స్ ప్రాజెక్టులు నిర్వహించేందుకు హ్యాండ్స్ ఆన్ ఎక్స్‌పీరియన్స్ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కోర్స్ డైరెక్టర్ ఏఎంఓ మహానంది తెలిపారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో కొనసాగిన శిక్షణకు ఆయన హాజరై మాట్లాడారు. ఒక్కో పాఠశాల నుంచి ఒక గణితం, ఇద్దరు భౌతికశాస్త్రం బోధించే ఉపాధ్యాయులు మొత్తం 45 మంది శిక్షణకు హాజరయ్యారని చెప్పారు. ఉపాధ్యాయుల శిక్షణతో విద్యార్థులకు మేలు చేకూరనుందని, అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధించి వారితో ప్రాజెక్టులు చేయించడానికి శిక్షణ ఉపయోగపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో కోర్స్ ఇన్‌చార్జ్, డీఎస్ఓ శ్రీనివాసులు, పీఎంశ్రీ స్కూల్స్ జిల్లా కో–ఆర్డినేటర్ ఎస్ఓ–1 శేఖర్, పీఎంశ్రీ డీఆర్పీ బలరాముడు, ఐఎఫ్‌పీ ప్యానెల్స్ జిల్లా ఇన్‌చార్జ్ శేఖర్, పాఠశాల ఇన్‌చార్జ్ సువర్ణాదేవి తదితరులు పాల్గొన్నారు.



ప్రాజెక్టులు చేస్తున్న ఉపాధ్యాయులు

ఇళ్ల నిర్మాణానికి ఇసుక, మట్టి కొరత ఉండొద్దు



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి అవసరమైన ఇసుక, మట్టి కొరత లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడీవోసీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ గృహాల నిర్మాణం కొరకు కావాల్సిన ఇసుక, మట్టి లభ్యతపై కమిటీ సభ్యులతో చర్చించడం జరిగిందని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇందిరమ్మ గృహాల లబ్ధిదారులకు అవసరమైన ఎనిమిది ట్రాక్టర్ల ఇసుకను, ఎనిమిది ట్రాక్టర్ల మట్టిని అందించి పనులు వేగవంతంగా పూర్తి అయ్యేలా చూడాలన్నారు. ట్రాక్టర్ ఇసుకకు రూ.100, మట్టికి రూ.400 చొప్పున వసూలు చేయాలన్నారు. వినియోగదారులు సంబంధిత తహసీల్దార్ ద్వారా దరఖాస్తు చేసుకున్నట్లయితే పరిశీలించి మంజూరు చేయాలన్నారు. ఇసుక తవ్వకాలు పూర్తి పారదర్శకంగా జరగాల్సిందిగా ప్రతి ట్రాక్టర్ పంపిణీకి సంబంధించిన సమాచారం ఖచ్చితంగా నమోదు చేసి తగిన రికార్డులను సమగ్రంగా నిర్వహించాలన్నారు. ప్రభుత్వం అవసరమైన ఇసుక, మట్టి వంటి నిర్మాణ సామగ్రిని లబ్ధిదారులకు కనిష్ట ధరలకు అందజేస్తుందన్నారు. ఇందిరమ్మ గృహాల లబ్ధిదారులు ఈ వనరులను వినియోగించుకుని త్వరితగతిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలన్నారు. అధికారులు సైతం ప్రత్యేంగా దృష్టి సారించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర వి.లక్ష్మీనారాయణ, మైనింగ్ ఏడీ వెంకటరమణ, డీపీవో నాగేంద్రం, ఇరిగేషన్ ఈఈ శ్రీనివాస్, మిషన్‌భగీరథ ఈఈ శ్రీధర్‌రెడ్డి, భూగర్భ జల ఏడీ మోహన్, ఉద్యానవన శాఖ అధికారి అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

పేరుకుపోయిన బకాయిలు



గద్వాలలోని మున్సిపల్ దుకాణ సముదాయం

- వ్యాపార సముదాయాలపై కొరవడిన పర్యవేక్షణ
- రూ.95 లక్షల అద్దె బకాయిలు
- మున్సిపల్ ఆదాయానికి గండి

గద్వాలటౌన్: గద్వాల మున్సిపాలిటీకి ఆదాయం సమకూర్చే మనరులుగా రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన వ్యాపార సముదాయాలు పరుల పాలవుతున్నాయి. దుకాణాలను పొందిన వ్యక్తులు వాటిని ఇతరులకు అద్దెకిచ్చి డబ్బులు వెనకేసుకుంటుండగా.. మున్సిపాలిటీకి మాత్రం అద్దె చెల్లించకుండా ఆదాయానికి గండి కొడుతున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని వ్యాపార సముదాయాల్లో నిబంధన ఉల్లంఘన అడుగడుగునా చోటుచేసుకుంటున్నా అద్దె వసూలు చేయాలనే సాహసం ఒక్క అధికారి చేయకపోవడం గమనార్హం. రాజకీయ జోక్యంతో సొంత ఆస్తులపై రాబడిని ఆర్జించలేని స్థితి మున్సిపాలిటీలో నెలకొంది.

గద్వాల మున్సిపాలిటీ వివరాలిలా..

మొత్తం దుకాణాలు **236**	ఏటా రావాల్సిన ఆదాయం రూ.**1.13**కోట్లు
నెలనెల రావాల్సిన అద్దె రూ.**9.48**లక్షలు	నెలనెల వసూలు అవుతున్న అద్దె **30**శాతం
ప్రస్తుతం మొత్తం బకాయిలు రూ.**95** లక్షలు	

ఇదీ పరిస్థితి

జిల్లాలో గద్వాలతో పాటు అయిజ, అలంపూర్, వడ్డేపల్లి మున్సిపాలిటీలు ఉన్నాయి. అయితే మూడు దశాబ్దాల క్రితం ఐడీఎస్ఎంటీ పథకం కింద కేంద్ర ప్రభుత్వ రుణంతో గద్వాల మున్సిపల్ పరిధిలో 236 దుకాణాలను చేపట్టారు. ఏ నుంచి హెచ్ బ్లాక్ వరకూ.. స్టోర్స్ అకాడమీ, నల్లకుంట కాలనీ, కూరగాయల మార్కెట్ దగ్గర, పాత బస్టాండ్, మున్సిపల్ కార్యాలయం పక్కన, కళాశాల మార్గంలో ఉన్న ప్రధాన రహదారుల పక్కన దుకాణాలను నిర్మించారు. కొన్ని దుకాణ సముదాయాలకు 30 ఏళ్ల లీజు అగ్రిమెంట్ పూర్తయింది. కేటాయించిన దుకాణాల అద్దెలను ప్రతి మూడేళ్లకు రెన్యూవల్ చేయాలి. కానీ అద్దెలను మాత్రం ప్రతి మూడు సంవత్సరాలకు పెంచకుండా తక్కువ మొత్తంలో అద్దెలు చెల్లిస్తూ మున్సిపాలిటీ ఆదాయానికి గండికొడుతున్నారు. ప్రస్తుతం మున్సిపాలిటీలో దుకాణాల అద్దె బకాయి రూ.95 లక్షలకు చేరుకుంది.

బకాయిలు వసూలు చేస్తాం



మున్సిపాలిటీకి సంబంధించిన దుకాణాల అద్దె బకాయిలను వసూలు చేయడానికి ప్రత్యేక కార్యాచరణ చేపడతాం. ఇప్పటికే బకాయిలు ఎక్కువగా ఉన్న దుకాణాలకు సంబంధించి జాబితా తయారు చేశాం. వారందరికి నోటీసులు జారీ చేస్తున్నాం. అప్పటికీ స్పందించకుంటే దుకాణాలకు తాళాలు వేస్తాం. దుకాణాల అద్దె విషయంలో కఠిన చర్యలు తప్పవు.

– దశరథ్, మున్సిపల్ కమిషనర్, గద్వాల

ఏళ్ల తరబడి అద్దె చెల్లింపుల్లేవ్

పాత బస్టాండ్ సముదాయంలో, పాత గ్రంథాలయ భవన నిర్మాణం కింద దుకాణాలను వేలం పాట ద్వారా అద్దెలకు ఇచ్చారు. భారీ మొత్తంలో వ్యాపారులు వేలం పాడి దుకాణాలను దక్కించుకున్నారు. ఇందులో చాలా మంది వ్యాపారులు దుకాణం దక్కించుకున్నప్పటి నుంచి అద్దెలే చెల్లించడం లేదు. ఈ రెండు సముదాయాలలో ఉన్న అద్దె బకాయిలే రూ.లక్షల్లో ఉన్నాయి. కొంత మంది రెండు, మూడేళ్ల నుంచి అద్దెలు చెల్లించడం లేదంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. అద్దె వసూళ్లకు వెళ్లిన మున్సిపల్ సిబ్బంది పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా పెద్ద మొత్తంలో అద్దె బకాయిలు పేరుకపోతున్నాయి.

'డీట్' ను సద్వినియోగం చేసుకోవాలి



గట్టులో డీట్ యాప్ పోస్టర్లను విడుదల చేస్తున్న పీడీ శ్రీనివాసులు తదితరులు

గట్టు: నిరుద్యోగ యువత ఉపాధి అవకాశాల కోసం ప్రభుత్వం రూపొందించిన డీట్ (డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ తెలంగాణ) యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఓ శ్రీనివాసులు కోరారు. శుక్రవారం గట్టులోని ఐకేపీ దగ్గర డీట్ యాప్‌కు సంబంధించిన పోస్టర్లను పీడీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీడీ శ్రీనివాసులు మాట్లాడుతూ డీట్ యాప్ ద్వారా నిరుద్యోగ యువకులు ఎక్కడికి వెళ్లకుండా ఉన్న చోటనే తమ అర్హతకు సరిపోయే ఉద్యోగాన్ని ఎంపిక చేసుకోవచ్చునని తెలిపారు. ఇందులో 944 కంపెనీలు భాగస్వాములు అయినట్లు తెలిపారు. ఆయా కంపెనీల్లో 8843 ఉద్యోగాలు ఉన్నట్లు తెలిపారు. ఇందులో ఫుల్ టైం,పార్టు టైం,వర్క్ ఫ్రం హోం వంటి ఉద్యోగాలు ఇందులో ఉన్నట్లు తెలిపారు. నైపుణ్యవంతులైన నిరీక్షల నుంచి ఎంఫిల్, పీహెచ్‌డీ వరకు విద్యార్హత కలిగిన 15 ఏళ్లపైబడిన వారు, పని చేయడానికి ఆసక్తి ఉన్న వికలాంగులతో సహా అన్నీ సామాజిక వర్గాల అభ్యర్థులు ఇందులో ఉద్యోగాలు పొందే అవకాశం ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈడీ సీ అసిస్టెంట్ మేనేజర్ శ్యామల, ఎంపీడీఓ చెన్న య్య, డీఆర్‌డీఏ డీపీఎం రూతమ్మ, సలోమి, యల్లప్ప, ఇన్‌చార్జ్ ఏపీఎం జయాకర్, సీసీలు పాల్గొన్నారు.

వంద పడకల ఆస్పత్రిని అందుబాటులోకి తెస్తాం



అలంపూర్ ఆస్పత్రిని పరిశీలిస్తున్న ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్

అలంపూర్: ప్రజారోగ్య పరిరక్షణే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని.. అలంపూర్ చౌరస్తాలోని వంద పడకల ఆస్పత్రిలో సరిపడా వైద్య సిబ్బందిని నియమించడంతోపాటు అత్యాధునిక పరికరాలు ఏర్పాటుచేసి త్వరలో అందుబాటులోకి తెస్తామని ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ అన్నారు. శుక్రవారం వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు వైద్య బృందంతో ఆస్పత్రిలోని ఐసీయూ, ఆపరేషన్ థియేటర్, సమావేశ, ఇతర గదులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజల యోగక్షేమాల నిమిత్తం 2018లో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో వంద పడకల ఆస్పత్రి మంజూరు చేయించానని అన్నారు. కానీ పనులు నత్తనడకన సాగిస్తూ ఈ ప్రాంత ప్రజల యోగక్షేమాలకు కాకుండా.. ఓట్లు సీట్ల కోసం గత ప్రభుత్వం వైద్యులు, పరికరాలు లేకుండానే ప్రారంభం చేసిందన్నారు. ప్రస్తుతం ఆస్పత్రి శిథిలావస్థకు చేరిందని, మంత్రి దామోదర రాజనర్సింహ చొరవతో ఆసుపత్రిలో సరిపడా సిబ్బందిని నియమించడంతోపాటు పరికరాలు ఏర్పాటు చేయనున్నట్లు, ఇందుకు జిల్లా వైద్య బృందం సహకరించడం సంతోషమన్నారు. పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి త్వరలో ప్రారంభిస్తామని సంపత్ కుమార్ అన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ సయ్యద్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ వినోద్, జిల్లా వైద్యులు అమీర్, దివ్యతోపాటు నాయకులు గోపాల్, రాములు, రవి, ఆలయ చైర్మన్ నాగేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అల్ట్రాసౌండ్ సేవలకు అవస్థలు

- జీజీహెచ్‌లో పడిగాపులు కాస్తున్న రోగులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు



ఖాళీగా ఉన్న అల్ట్రాసౌండ్ మిషన్

పాలమూరు: మహబూబ్‌నగర్ జిల్లా జనరల్ ఆస్పత్రిలో రేడియాలజీ విభాగంలో సరిపడా వైద్య సిబ్బంది లేకపోవడంతో రోగులకు నిత్యం అవస్థలు తప్పడం లేదు. ప్రధానంగా అవసరం ఉన్న అల్ట్రా స్కానింగ్‌తో నానా ఇబ్బందులు పడుతున్నారు. నిబంధనల ప్రకారం జనరల్ ఆస్పత్రిలో ఉండే రేడియాలజీ విభాగం 24 గంటలపాటు అందుబాటులో ఉండాలి. కానీ, ఇక్కడ కేవలం 4 గంటలు మాత్రమే రోగులకు అందుబాటులో ఉంటున్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు 60 నుంచి 70మంది రోగులకు అల్ట్రాసౌండ్ స్కానింగ్ పరీక్షలు పూర్తి చేస్తున్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి మళ్లీ ఉదయం 9.30 గంటల వరకు అల్ట్రాసౌండ్ స్కానింగ్ అవసరమైన రోగులు ఉంటే బయట ప్రైవేట్‌కు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది.

ఒకే మిషన్‌తో..

ఆస్పత్రిలో మొత్తం 3 స్కానింగ్ మిషన్స్ ఉండగా రెండు పనిచేస్తుండగా మరో మిషన్ మరమ్మతుకు గురైంది. ప్రస్తుతం ఒక్కరే వైద్యుడు ఉండగా మరో మిషన్ ఖాళీగా ఉంటుంది. రేడియాలజీ విభాగంలో ఒక ప్రొఫెసర్ ఉండగా అసోసియేట్ ప్రొఫెసర్ ఖాళీగా ఉంది. మూడు అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులలో ఇద్దరు వైద్యులు పని ఒత్తిడి తట్టుకోలేక విధులకు హాజరుకావడం లేదు. కేవలం ఒకే ఒక్క అసిస్టెంట్ ప్రొఫెసర్‌తో అల్ట్రాసౌండ్ స్కానింగ్ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఇద్దరూ ఎస్ఆర్ ఉంటే దీంట్లో ఒకరు రావడం లేదు. వీరే సీటీ స్కానింగ్, అల్ట్రాసౌండ్ పరీక్షలు చేయాలి. దీంతో అక్కడ పని చేసే సిబ్బంది పని ఒత్తిడి ఎక్కువగా అవుతుంటే రోగులకు స్కానింగ్ సేవలు సక్రమంగా అందడం లేదు.

వసూళ్ల పర్వం ఆగేనా..?

- ఏసీబీ దాడులతో నిర్మానుష్యం
- సందడిలేని జడ్చర్ల సబ్‌రిజిస్ట్రార్ ఆఫీస్
- మూతబడిన డాక్యుమెంటర్స్ కార్యాలయాలు



సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద మూతబడిన డాక్యుమెంటర్స్ కార్యాలయాలు



జడ్చర్ల: అక్రమ వసూళ్లు, అవినీతి కార్యకలాపాలకు అడ్డాగా పేరొందిన జడ్చర్ల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం పనితీరుపై ఆదినుంచి అనేక ఆరోపణలు, విమర్శలు ఉన్నాయి. దాదాపు దశాబ్ద కాలంగా ఇక్కడ అక్రమాలు యథేచ్ఛగా సాగుతున్నా ఎప్పుడూ ఎక్కడా ఉన్నతాధికారులు స్పందించిన దాఖలాలు లేవు. అంతేగాక ఏసీబీ సైతం కార్యాలయం దరిదాపుల్లోకి వచ్చిన పరిస్థితి చరిత్రలో లేదు. ఇలాంటి క్రమంలో గురువారం ఆకస్మికంగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంపై ఏసీబీ దాడులకు ఎగబడడం చర్చనీయాంశంగా మారింది. ఇక్కడ పనిచేసిన వారంతా రూ.కోట్లు కూడబెట్టుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో జడ్చర్ల సబ్‌రిజిస్ట్రార్ సీటుకు ఆ శాఖలో గోల్డెన్ సీటుగా ప్రచారం ఉంది. ఇక్కడికి బదిలీపై రావాలనుకున్నవారు భారీ అంచనాలతోనే వస్తారన్న ప్రచారం ఉంది. రెండు జాతీయ రహదారులతోపాటు విలువైన భూములు, ప్లాట్లు ఉండడమే ఇందుకు కారణంగా పేర్కొంటున్నారు. అయితే గత ప్రభుత్వ హయాంలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ బాధ్యతలను తహసీల్దార్‌కు అప్పగించడంతో కాస్త డిమాండ్ తగ్గింది.

ఉలిక్కి పడిన జడ్చర్ల

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ తనిఖీలు జరుగుతున్నాయన్న విషయం తెలియగానే ఒక్కసారిగా జడ్చర్ల ఉలిక్కిపడింది. ఇంతకాలానికి ఏసీబీ దృష్టిసారించడం వెనుక అంతర్యమేమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సాధారణ తనిఖీలుగానే సంబంధిత అధికారులు పేర్కొంటున్నా.. ఎవరో బలమైన ఫిర్యాదు చేశారన్న ఊహాగానాలు వెలువడుతున్నాయి. ఏదిఏమైనా ఏసీబీ తనిఖీలను ప్రజలు స్వాగతిస్తున్నారు.



నిర్మానుశంగా మారిన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

జాడలేని డాక్యుమెంట్ రైటర్లు

ఏసీబీ దాడుల నేపథ్యంలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఒక్కసారిగా నిర్మానుశంగా మారింది. డాక్యుమెంట్ రైటర్లు, పైరవీకారులతో నిత్యం రద్దీతో సందడిగా ఉండే కార్యాలయం శుక్రవారం బోసిపోయింది. డాక్యుమెంట్ రైటర్స్ కార్యాలయాలు మూతబడ్డాయి. మచ్చుకు ఒక్క రైటర్ కనిపించక పోవడం విశేషం. కాగా శుక్రవారం ఎస్ఆర్‌ఓ సమ్మయ్య, సిబ్బంది యథావిధిగా విధులకు హాజరయ్యారు. తాము నిబంధనలకు అనుగుణంగానే విధులు నిర్వర్తిస్తున్నామని, ఎక్కడా అక్రమాలకు తావివ్వలేదని పేర్కొన్నారు.

నిశితంగా ఏసీబీ దర్యాప్తు

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో గురువారం అర్ధరాత్రి దాకా కొనసాగిన తనిఖీల నేపథ్యంలో ఏసీబీ దర్యాప్తు నిశితంగా కొనసాగుతుంది. కార్యాలయం కార్యకలాపాలను పరిశీలించేందుకు సీసీ పుటేజీలు కీలకంగా మారుతాయని భావించినా అవి కొంతకాలంగా పనిచేయక పోవడం ఇబ్బందిగా మారింది. ఇక తనిఖీల సమయంలో సిబ్బంది ఫోన్లతోపాటు పలువురి డాక్యుమెంట్ రైటర్ల ఫోన్లను స్వాధీనపర్చుకుని ఆన్‌లైన్ లావాదేవీలను పరిశీలిస్తున్నారు. ఓ రైటర్ వద్ద కొంత నగదును స్వాధీన పర్చుకున్న అధికారులు రికార్డులు, డాక్యుమెంట్లను స్వాధీన పర్చుకుని విచారిస్తున్నారు. కార్యాలయం అవినీతి అక్రమాల లావాదేవీలకు సంబంధించి కీలకంగా మారిన ఓ ప్రైవేట్ వ్యక్తి పరారీలో ఉన్నట్లు గుర్తించారు. కాగా జడ్చర్ల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంతోపాటు ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి లేకుండా పరిపాలన సాగే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

శాకంబరీదేవిగా జోగుళాంబ అమ్మవారు



అలంపూర్: అలంపూర్ జోగుళాంబ అమ్మవారు శుక్రవారం శాకంబరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాడ మాసం చివరి శుక్రవారం కావడంతో అర్చకులు అమ్మవారిని వివిధ రకాల పండ్లు, కూరగాయాలతో అందంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించి భక్తులను దర్శనానికి అనుమతించారు. ఆలయ కమిటీ చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, ఈఓ పురేందర్‌కుమార్, ధర్మకర్తలు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

■ జోగుళాంబ అమ్మవారిని శుక్రవారం ఎమ్మెల్యే విజయుడు దర్శించుకున్నారు. ఈఓ పురేందర్‌కుమార్, అర్చకులు ఆయనకు స్వాగతం పలికి స్వామి, అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయించారు.

గుడిపల్లి లిఫ్ట్ నుంచి నీటి విడుదల



పూజలు చేస్తున్న ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు రాజేశ్‌రెడ్డి, మేఘారెడ్డి

నాగర్‌కర్నూల్ రూరల్: మండలంలోని గుడిపల్లి వద్ద ఉన్న మహాత్మాగాంధీ మూడో లిఫ్ట్ వద్ద శుక్రవారం ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు రాజేష్‌రెడ్డి, మేఘారెడ్డి ప్రత్యేక పూజలు చేసి మోటారు ప్రారంభించి సాగునీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వంలో రైతులకు అన్నివిధాలుగా న్యాయం జరుగుతుందని వెల్లడించారు. పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసి చివరి ఆయకట్టుకు నీరందిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీఈ విజయభాస్కర్‌రెడ్డి, ఎస్ఈ సత్యనారాయణరెడ్డి, ఈఈలు, కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం వైపు కృష్ణమ్మ పరుగులు



సుంకేసుల నుంచి దిగువకు వెళ్తున్న వరద



జూరాల నుంచి పరుగులు పెడుతున్న కృష్ణమ్మ

ధరూర్/ఆత్మకూర్/దోమలపెంట/రాజోళి: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఒక్కసారిగా భారీగా వరద పెరిగింది. శుక్రవారం రాత్రి 7 గంటల సమయంలో ప్రవాహం 1.15 లక్షల క్యూసెక్కులుండగా.. 18 గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదిలారు. క్రస్టుగేట్లు, విద్యుదుత్పత్తి, ఎత్తిపోతల పథకాలకు కలిపి మొత్తం జూరాల నుంచి 1,06,213 క్యూసెక్కుల ఔట్ ఫ్లో నమోదైంది. ఎగువన ఉన్న ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులకు వరద జోరు కొనసాగుతున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఆల్మట్టి ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 129.72 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 90 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టుకు 95,868 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. దిగువన ఉన్న నారాయణపూర్ ప్రాజెక్టుకు 89,074 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టుకు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 37.64 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 33.319 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టుకు 90వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 25 క్రస్టు గేట్లను ఎత్తి 90,750 క్యూసెక్కుల నీటిని దిగువ ఉన్న జూరాలకు ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు.

కొనసాగుతున్న విద్యుదుత్పత్తి...

31 వేల క్యూసెక్కుల నీటిని వినియోగించి ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు దిగువ, ఎగువ జలవిద్యుదుత్పత్తి కేంద్రాల్లో 11 యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువలో 5 యూనిట్ల ద్వారా 195 మెగావాట్లు, దిగువ 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు విద్యుదుత్పత్తి చేశారు.

■ శ్రీశైలం ప్రాజెక్టుకు జూరాల స్పిల్‌వే ద్వారా 71,604 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి చేస్తూ 30,498, సుంకేసుల నుంచి 39,411 మొత్తం 1,41,513 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం 881.2 అడుగుల వద్ద 194.7599 టీఎంసీల నీటి నిల్వ ఉంది. భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కులు, ఏపీ జెన్కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 32,478 మొత్తం 67,793 క్యూసెక్కుల నీటిని దిగువన సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ఇరవై నాలుగు గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 20వేల క్యూసెక్కులు, ఎంజీకేఎల్‌ఐకు 1,600, హెచ్ఎన్ఎస్ఎస్ లిఫ్టు ఇరిగేషన్ నుంచి 675 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 17.733 మి.యూనిట్లు, కుడిగట్టు కేంద్రంలో 17.558 మి.యూనిట్ల విద్యుదుత్పత్తి చేశారు.

సుంకేసుల నుంచి 41వేల క్యూసెక్కులు

సుంకేసుల డ్యాం నుంచి శుక్రవారం 41 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్లు జేఈ మహేంద్ర తెలిపారు. శుక్రవారం ఎగువ నుంచి 41 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. తొమ్మిది గేట్లు తెరిచి 39,411 క్యూసెక్కులను దిగువకు, 2,354 క్యూసెక్కుల నీటిని కేసీ కెనాల్‌కు వదిలినట్లు ఆయన పేర్కొన్నారు.

విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయండి



సమావేశంలో పాల్గొన్న వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 23న జరిగే విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాల ఐక్యవేదిక నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని సురవరం వెంకటరమణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాస్కర్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి భరత్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి సీతారాం, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు గడుస్తున్నా విద్యాసంస్థలను గాలికి వదిలేశారని ఆరోపించారు. పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు చదువుతున్న విద్యాసంస్థలకు మూడేళ్ల నుంచి స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.8 వేల కోట్లు పేరుకుపోయి.. విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. అసంపూర్తిగా ఉన్న ప్రభుత్వ పాఠశాల భవనాలు, మరుగుదొడ్లు, మూత్రశాలలు, వంట గదులను వెంటనే నిర్మించాలని డిమాండ్ చేశారు. వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యాసంస్థల బంద్‌కు అన్ని విద్యాసంస్థల యాజమాన్యాలు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలని కోరారు.

మైసమ్మ అడవిలో అధికారుల పర్యటన

దేవాలయానికి భూ కేటాయింపులపై విచారణ



మైసమ్మ అడవిలో పర్యటిస్తున్న రెవెన్యూ అధికారులు

నవాబుపేట: మండలంలోని మైసమ్మ ఆలయానికి 5 ఎకరాల అటవీ భూమి కేటాయింపుపై శుక్రవారం రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించారు. మైసమ్మ ఆలయానికి అటవీ భూమి కేటాయించి, ఆలయ అభివృద్ధికి సహకరించాలని దాదాపు 20 ఏళ్లుగా విజ్ఞప్తులు అందుతున్నాయి. కాగా దీనికి సంబంధించిన ఫైల్ సంబంధిత అటవీశాఖ అధికారులతో ఉండగా.. తాజాగా మరోసారి అటవీ భూమిలో క్షేత్రస్థాయి పర్యటన చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. ఈ తరుణంలో ఆర్ఓఎఫ్ఆర్ సర్టిఫికెట్ ఇచ్చేందుకు శుక్రవారం ఆర్డీఓ నవీన్, జిల్లా అధికారులతో కలిసి ఆలయ పరిసరాల్లో సర్వే నిర్వహించి, ఆ ప్రాంతంలో ఉన్న చెట్లు, ఇతర అంశాల గురించి చర్చించారు. దేవాలయ అవసరాలకు కావాల్సిన భూమిని ఇవ్వాలని, దీనికి గాను అదనంగా వేరే చోట దాదాపుగా 12 ఎకరాల భూమిని అటవీశాఖకు అప్పగించేలా రెవెన్యూ అధికారులు గతంలోనే రికార్డులు అందించారు. దీంతో 5 ఎకరాల అటవీ భూమిని దేవాలయానికి ఇచ్చేలా ప్రతిపాదన సిద్ధమైంది.

అభివృద్ధికి ఆటంకం

దేవాలయం ఉన్న ప్రాంతం మినహా ఇతర ప్రదేశాల్లో ఎలాంటి నిర్మాణాలకు అటవీ శాఖ అధికారులు అనుమతి ఇవ్వటం లేదు. దీంతో ఆలయం ఆవరణలో చాలా అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. అందరి ఆకాంక్ష మేరకు భూమి కేటాయింపు జరిగితే ఆలయం మరింత అభివృద్ధి చెందుతుందని భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, మైసమ్మ ఆలయ చైర్మన్ జగన్మోహన్‌రెడ్డి, ఈఓ నర్సింహులు, రామస్వామి, రవి, నారాయణరెడ్డి, యాదయ్య, బాలయ్య, గోపాల్ తదితరులు ఉన్నారు.

వ్యక్తి మృతిపై కేసు నమోదు

గోపాల్‌పేట: ఫిట్స్ వచ్చి వ్యక్తి మృతిచెందిన ఘటన ఏదుల మండలంలోని చెన్నారంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. రేవల్లి ఎస్సై రజిత కథనం ప్రకారం.. ఏదుల మండల కేంద్రానికి చెందిన వీరపాగ దేవ(32) చెన్నారం గ్రామానికి చెందిన లక్ష్మిని ఏడేండ్ల క్రితం పెళ్లి చేసుకున్నాడు. అప్పటి నుంచి చెన్నారంలోనే అత్తవారి ఇంటివద్ద ఉండి కూలీ పని చేసుకుని బతికేవాడు. వీరికి ముగ్గురు కూతుర్లు. ఐదురోజుల కిందట వీరికి ఒక కుమారుడు పుట్టాడు. భార్యతోపాటు తన అత్త వనపర్తి ఆస్పత్రిలో ఉన్నారు. గురువారం రాత్రి ఇంట్లో దేవ అతడి మామ మాత్రమే ఉన్నారు. అర్ధరాతి దేవ మామ యేసు మూత్రానికి లేవగా.. అప్పటికే దేవ నోట్లో నుంచి నురగ కారుతూ మృతిచెంది కనిపించాడు. దేవ తండ్రి రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

క్లుప్తంగా

'ఫోన్ నంబర్ బ్లాక్ చేసి.. రూ.4లక్షలు కాజేశారు'

మాగనూర్: మండలంలోని మందిపల్లి గ్రామానికి చెందిన మేనిగడ్డ గోపాల్‌రెడ్డికి చెందిన ఫోన్ నంబర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు బ్లాక్ చేసి రూ. 4 లక్షలు కాజేసిన ఘటనపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు మాగనూర్ ఎస్ఐ పి.అశోక్‌బాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. మే 31 మధ్యాహ్న సమయంలో గోపాల్‌రెడ్డికి 82598 80042 నంబర్ నుంచి ఫోన్ చేసి వాట్సాప్ నంబర్ ఇవ్వాలని హిందీలో అడగగా.. అతడు నంబర్ ఇచ్చాడన్నారు. అదే రోజు సాయంత్రం గోపాల్‌రెడ్డి ఫోన్ నంబర్ బ్లాక్ చేసి, ఆ నంబర్‌పై గుర్తు తెలియని వ్యక్తులు కొత్త సిమ్ కార్డు తీసుకున్నారు. గుర్తించిన గోపాల్‌రెడ్డి జూన్ 4న మళ్లీ అదే నంబర్‌ను తీసుకున్నాడు. అయితే 6న ఎస్‌బీఐకు వెళ్లి అకౌంట్‌లో నగదును తనిఖీ చేయగా పలుమార్లు తన అకౌంట్ నుంచి రూ. 4,00,995 ఆన్‌లైన్ ద్వారా గుర్తుతెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫర్ చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. సైబర్ మోసానికి గురైనట్లు గుర్తించిన బాధితుడు అకౌంట్‌ను హోల్డ్‌లో పెట్టారన్నారు. అనంతరం ఘటనపై మాగనూర్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్ఐ తెలిపారు.

మోసం చేసిన ఘటనపై కేసు నమోదు

గట్టు: ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన చిన్నోనిపల్లె గ్రామానికి చెందిన రఘుకుమార్‌గౌడ్‌తో పాటుగా అతని సోదరుడు వీరేష్‌గౌడ్‌పై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మల్లేష్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు.. చిన్నోనిపల్లె గ్రామానికి చెందిన రఘుకుమార్‌గౌడ్ ఖమ్మం జిల్లా పాల్వంచకు చెందిన ప్రియాంకను హైదరాబాదులో కోచింగ్ తీసుకుంటున్న క్రమంలో ప్రేమించి పెళ్లి చేసుకుంటానని చెప్పి, ఉద్యోగం వచ్చిన తర్వాత నిరాకరించడంతో ప్రియాంక బుధవారం చిన్నోనిపల్లె గ్రామంలోని రఘుకుమార్‌గౌడ్ ఇంటికి చేరుకుంది. పెళ్లి చేసుకోవాలని ప్రశ్నించిన తరుణంలో రఘుకుమార్‌గౌడ్ సోదరుడు వీరేష్‌గౌడ్ ప్రియాంకపై చేయి చేసుకోవడంతో మనస్తాపం చెందిన ప్రియాంక నిద్రమాత్రలు మింగింది. దీంతో ప్రియాంకను గ్రామస్తులు గద్వాల ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం కోలుకున్న ప్రియాంక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

మృతదేహం లభ్యం

వీపనగండ్ల: మండలంలోని గోపల్‌దిన్నె శివారు జూరాల ప్రధాన కాల్వలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ రాణి తెలిపారు. నీటి ప్రవాహంలో ఎగువ నుంచి లోతట్టు ప్రాంతానికి కొట్టుకొచ్చి ఉంటుందని.. బయటకు తీసి పోస్ట్‌మార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి పంపించినట్లు వివరించారు.

చిరుతను పట్టుకునేందుకు ప్రత్యేక రెస్క్యూ బృందం



చిరుత కోసం గాలింపును ప్రారంభిస్తున్న హైదరాబాద్ నుంచి వచ్చిన రెస్క్యూ బృందం

గాలింపు చర్యలు ప్రారంభం

మహబూబ్‌నగర్ న్యూటౌన్: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం తిర్మల్‌దేవుని గుట్ట, వీరన్నపేట గుర్రం గట్టు ఏరియాల్లో సంచరిస్తూ హడలెత్తిస్తున్న చిరుతను పట్టుకునేందుకు హైదరాబాద్ నెహ్రూ జూలాజికల్ పార్కు నుంచి ప్రత్యేక రెస్క్యూ బృందం శుక్రవారం జిల్లా కేంద్రానికి చేరుకుంది. ఇదివరకే సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్న పోలీసు, అటవీ శాఖలకు చెందిన బృందాలతోపాటు హైదరాబాద్ నుంచి వచ్చిన ప్రత్యేక రెస్క్యూ బృందం గాలింపును ప్రారంభించింది. సాయంత్రం వరకు ఎలాంటి ఆచూకీ లభించకపోవడంతో హైదరాబాద్ నుండి మరో రెండు బోన్‌లు తెప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. శనివారం జిల్లాకు మరోరెండు బోన్‌లు తీసుకరానున్నారు. ఇదివరకే ఒక బోన్‌ను ఏర్పాటు చేసి సీసీ కెమెరాలు, డ్రోన్ సర్వేలైన్స్ ద్వారా పర్యవేక్షణ చేస్తున్న అధికారులు తాజాగా ప్రత్యేక బృందం హైదరాబాద్ నుంచి రావడంతో చిరుత తప్పించుకునే ఆస్కారం లేదని అధికారులు పేర్కొంటున్నారు. గతనెల 30వ తేదీ నుంచి సర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్న అటవీశాఖ, పోలీసు శాఖలకు చెందిన బృందాలకు చిరుత పులి సవాల్ విసురుతోందనే చెప్పవచ్చు. ఒకవైపు సెర్చ్ నిర్వహిస్తుంటే మరోవైపు చిరుత కనిపించడం కలకలం రేపుతోంది. పరిసర ప్రాంతాల ప్రజలు భయాదోళనలకు గురవుతున్న నేపథ్యంలో అధికారులు అవగాహన కల్పిస్తూ భద్రతా చర్యలు చేపడుతున్నారు.



చిరుత సంచరిస్తున్న ప్రాంతాన్ని కలెక్టరేట్ బంగ్లా ఫ్లైఓవర్ మీద నుంచి చూస్తున్న వాహనదారులు

ఆకట్టుకున్న 'ఫుడ్ ఫెస్టివల్'

- శిల్పారామంలో సుమారు 50 స్టాళ్లలో ప్రదర్శనలు
- ఎమ్మెల్యే యెన్నంతో పాటు ఉన్నతాధికారుల సందర్శన



తినుబండారాలతో పాటు దీపంతలను ప్రదర్శిస్తున్న చిన్నదర్‌పల్లి మహిళలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: మహిళా శక్తి సంబరాల్లో భాగంగా మెప్మా ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక శిల్పారామంలో ఏర్పాటు చేసిన ఫుడ్ ఫెస్టివల్ ఆకట్టుకుంది. సుమారు 50 స్టాళ్లలో ఆయా మహిళా సంఘాలకు చెందిన ఉత్పత్తులను ప్రదర్శించారు. స్టాళ్లను ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డితో పాటు కలెక్టర్ విజయేందిర బోయి, స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్ తదితరులు సందర్శించారు. ముఖ్యంగా మిల్లెట్ మాల్ట్, వివిధ రకాల తినుబండారాలు, వస్త్ర, జ్యూట్ ఉత్పత్తులపై ప్రజలు ఆసక్తి చూపి, కొనుగోలు చేశారు.

టీ వద్దు.. మిల్లెట్ మాల్ట్ ముద్దు



నిత్యం ఉదయమే టీ తాగడం అందరికీ అలవాటే. దీనికి బదులుగా ఆరోగ్యంగా ఉండేందుకు మిల్లెట్ మాల్ట్ ఒక గ్లాసు తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారు. మేము 24 రకాల మొలకెత్తిన ధాన్యాలతో మిల్లెట్ హౌస్ మాల్ట్‌ను ఇంటి వద్దే తయారు చేస్తున్నాం. ఇందులో ఆరబెట్టిన డ్రైఫ్రూట్స్, బెల్లం, కొద్దిగా నెయ్యి, ఇలాచీలు కలిపి పౌడర్‌గా తయారు చేసి విక్రయిస్తున్నాం.

– కృష్ణవేణిరెడ్డి, ఆకర్షణ ఎస్ఎల్ఎఫ్ ఆర్పీ

ఆవు పేడతో దీపంతలు



చిన్నదర్‌పల్లిలో ఆరుగురు మహిళా సంఘాల సభ్యులతో కలిసి సుమారు పదేళ్లుగా ఆవు పేడతో దీపంతలు, ధూపం స్టిక్స్ తయారు చేస్తున్నాం. స్థానికంగా ఉండే శ్రీలక్ష్మి గోశాల నుంచి ముడి సరుకులు తెచ్చుకుంటున్నాం. అలాగే ఆవు పేడ, పంచకంతో వ్యవసాయ రంగానికి ఉపయోగపడే జీవామృతం సైతం తయారు చేసి రైతులకు అమ్ముతున్నాం. డ్రైఫ్రూట్స్‌తో లడ్డూలు తయారు చేసి విక్రయించి ఆదాయం పొందుతున్నాం.

– కావలి కృష్ణవేణి, శ్రీమల్లికార్జున ఎస్ఎల్ఎఫ్ ఆర్పీ

ఇంటి వద్దే..



భాగ్యలక్ష్మి మహిళా సంఘంలో 15 ఏళ్లుగా సభ్యురాలిగా ఉన్నా. కొన్నేళ్లుగా ఇంటి వద్దే తొమ్మిది రకాల చట్నీలు, తినుబండారాలు తయారు చేస్తున్నా. మరో ఇద్దరు మహిళలకు ఉపాధి కల్పిస్తున్నా. భర్త వీరేందర్ ఆటో డ్రైవర్. ఏడాది క్రితమే రాంనగర్‌లోని గ్రంథాలయం ఎదురుగా చిన్న దుకాణం ఏర్పాటు చేసుకుని వీటిని విక్రయిస్తున్నాం.

– గీత, సభ్యురాలు, బండమీదిపల్లి